క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



జగిత్యాల: జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ తన పుట్టిన రోజు సందర్భంగా శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. అనంతరం జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై చర్చించారు. జగిత్యాల సమగ్రాభివృద్ధికి సహకరిస్తానని సీఎం హామీ ఇచ్చారని, ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపినట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శుభాకాంక్షలు తెలుపుతూ సత్కరించారు.

మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరణ



చిరంజీవి

రాయికల్: రాయికల్ మున్సిపల్ కమిషనర్‌గా చిరంజీవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ పనిచేసిన జగదీశ్వర్ గౌడ్ సస్పెండ్ కావడంతో రాయికల్ ఎంపీడీవోగా పనిచేస్తున్న చిరంజీవికి కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను వివిధ పార్టీలకు చెందిన నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బయోమైనింగ్ ప్లాంట్‌కు స్థల పరిశీలన

రాయికల్: పట్టణంలోని డంపింగ్‌యార్డు వద్ద బయోమైనింగ్ ప్లాంట్ కోసం శనివారం మున్సిపల్ కమిషనర్ చిరంజీవి స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట మేనేజర్ వెంకట్, పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్, బయోమైనింగ్‌కు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్సై

ధర్మపురి(బుగ్గారం): బుగ్గారం మండలంలోని బిర్సానీ గ్రామంలో శనివారం నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్సై శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన చట్టాలు అమలు, వాటి వల్ల ప్రజలకు చేకూరే ప్రయోజనాలు, సైబర్ నేరాలు, గుడుంబా, గంజాయి నిర్మూలన తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సేవలు వినియోగించుకోవాలి



చిన్నారికి అన్న ప్రాసన చేస్తున్న ఎంపీడీవో

పెగడపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని మూడో అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. కేంద్రంలోని చిన్నారుల హాజరు రిజిష్టర్‌ను పరిశీలించి, లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారికి అన్నప్రాసన చేశారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ సేవలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, అంగన్‌వాడీ టీచర్ శ్రీదేవి, కారోబార్ స్వామి, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

మహిళా టైలరింగ్ కేంద్రం పరిశీలన

కథలాపూర్: మండలంలోని సిరికొండలో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా టైలరింగ్ సెంటర్‌ను డీఆర్డీవో సంపత్‌రావు శనివారం పరిశీలించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సంబంధించిన యూనిఫామ్స్ మహిళలు కుడుతూ సరఫరా చేస్తున్నారని అధికారులు వివరించారు. దీంతో మహిళలకు అదనపు ఆదాయం సమకూరుతుందని అధికారులు పేర్కొన్నారు. ఆయన వెంట ఏపీఎం నరహరి ఉన్నారు.

సాహితీ వనంలో కవితా సుమాలు

- సందేశాత్మక రచనలతో సామాజిక స్ఫూర్తి
- జగిత్యాల రచయిత్రులకు రాష్ట్ర వ్యాప్త గుర్తింపు



కలెక్టర్ చేతుల మీదుగా అనితకు సత్కారం(ఫైల్)

జగిత్యాలటౌన్: మహిళలు కుటుంబ బాధ్యతలు, ఉద్యోగాలే కాకుండా తమ రచనలతో సమాజాన్ని తట్టి లేపుతూ సాహితీవనంలో అక్షర పూలు పూయిస్తూ కవితా కుసుమాలుగా వెలుగు వెలుగుతూ రాష్ట్ర వ్యాప్త గుర్తింపు సొంతం చేసుకుంటున్నారు. మాతృత్వపు మమకారాన్ని, అమ్మతనపు ఔన్నత్యాన్ని ఆకాశమంత ఎత్తుకు చాటడంతో పాటు భ్రూణ హత్యలు, మహిళలపై వేధింపులు లాంటి కుసంస్కృతిని తులనాడుతూ సమాజంలోని మంచిని ప్రోత్సహిస్తూ చెడును చెండాడుతున్నారు. తమ వైవిధ్యమైన రచనలతో తాము అందుకున్న అవార్డులు, రివార్డులకే వన్నె తెస్తూ జగిత్యాల సాహితీవనంలో అక్షర పూలు పూయిస్తున్న మొల్లమాంబ వారసులపై సండే స్పెషల్ స్టోరీ..

సండే స్పెషల్

అన్నింటా తామై ముందుకు

- జిల్లాకు చెందిన పలువురు మహిళా రచయితలు తమ వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లో రాణిస్తూనే తీరిక సమయాల్లో తమలోని సృజనాత్మకతకు పదును పెడుతూ అపురూపమైన రచనలతో సందేశాలు, చురకలతో సమాజంలోని చెడును కడిగేస్తూ మంచిని ప్రోత్సహిస్తూ రచనలు చేస్తున్నారు.

అనిత రచనలు

- మన పండుగలు, జీవన సౌరభం, ఆగిపోకు లాంటి పుస్తకాలు అచ్చయ్యాయి.
- ఈమె రచనలు అక్షరాల తోవ వారితో జాతీయ ఉత్తమ కవితా పురస్కారం, స్వర్ణ భారతి వేదిక వారి జాతీయస్థాయి పోటీల్లో పురస్కారం పొందారు. గోల్కొండ సాహితీ సంస్థ వారిచే మణిపూసల కవి భూషణ అవార్డు, జాతీయస్థాయి సినారే పోటీలో ఈటల రాజేందర్ చేతుల మీదుగా అవార్డు, అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌తో బతుకమ్మ వేడుకల్లో భాగస్వామ్యమయ్యారు. జీవితం పూల పాన్పు కాదు



- చిన్న వయసులోనే మా తండ్రి మరణంతో పేదరికపు కష్టాల పొదరింట్లో పెరిగాము. భేషజం లేకుండా అమ్మ చెప్పే ధైర్యపు మాటలే ఊపిరిగా చదువుపై ఆసక్తిని పెంచుకుని ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డాను. జీవితం ఎవరికీ పూలపాన్పు కాదని, నేటి యువత పోరాడి సాధించుకోవాలి.

– అయిత అనిత రచయిత్రి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు

- జిల్లాకు చెందిన మరో ప్రముఖ రచయిత్రి మూలస్థం లావణ్య, గృహిణిగా ఇంటిని చక్కబెట్టుకుంటూనే సుమారు 500 వందలకు పైగా కవితా రచనలు చేసి జిల్లా ఉత్తమ రచయితగా కలెక్టర్ శరత్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఇంకా ఎన్నో అవార్డులు, ప్రశంసలు లావణ్యను వరించాయి.

హలం పట్టి దుక్కిదున్ని

- నారుపోసి, నీరుపెట్టి .... బంగారం పండించి దేశానికి అన్నం పెడతాడు అన్నదాత అంటూ రైతన్న గొప్పతనాన్ని తన రచనల ద్వారా అభిషేకించారు లావణ్య.

భర్త ప్రోత్సాహంతోనే



నా భర్త శివప్రసాద్ తోడ్పాటుతోనే రచయిత్రిగా నిలదొక్కుకున్నాను. స్వాతంత్ర్య వేడుకల్లో అప్పటి కలెక్టర్ శరత్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం నాకు మధురానుభూతిని మిగిల్చింది.

– మూలస్థం లావణ్య, రచయిత్రి

- జిల్లాకు చెందిన మరో రచయిత్రి మార విజయలక్ష్మి, ఈమె రెప్ప కింది ఉప్పెన, వెన్నెల వన్నెలు, జీవన నానీలు, విజయామృత వీచికలు, కోవిడ్–19 విజేతలు లాంటి కవితా సంపుటాలలో 900 పైగా కవితలు రాసి గుర్తింపు పొందారు.

ఇల్లాలి ప్రేమెప్పుడూ ఒంటరే

- ఇంటి బాధ్యతలతో నిరంతరం సతమతమయ్యే ఇల్లాలి ప్రేమెప్పుడూ ఒంటరే అంటారు. మార విజయలక్ష్మి తన రెప్ప కింది ఉప్పెన కవితా సంపుటిలో

– మార విజయలక్ష్మి

బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి



కోరుట్లలో నివాళి అర్పిస్తున్న కమిషనర్

కోరుట్లటౌన్: బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా శనివారం మున్సిపల్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, విగ్రహ కమిటీ సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి కమిషనర్ మోహన్, ఇతర సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

పెగడపల్లి: జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో దళిత సంఘాల నాయకులు ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, దుర్గాప్రసాద్, స్వామి, రాజరత్నం, గోపాల్, మాణిక్యం, అంజి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వన మహోత్సవంలో భాగస్వాములు కావాలి



మొక్కలు నాటుతున్న ప్రభుత్వ విప్,అధికారులు

కథలాపూర్: వన మహోత్సవంలో ప్రజలు భాగస్వాములు కావాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. మండలంలోని పోతారం గ్రామశివారులో శనివారం మొక్కలు నాటారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో 37 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ప్రజలకు సూచించారు. సంక్షేమ పథకాలు అర్హులందరికి చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు, డీఆర్డీవో సంపత్‌రావు, ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ ముంతాజిబొద్దీన్, ఏపీఎం నరహరి, నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో నష్టం

జగిత్యాలరూరల్: బాల్య వివాహాలతో బాలికలు ఎంతో ఆరోగ్యంగా నష్టపోతారని మహిళ సాధికారత కేంద్రం జిల్లా మిషన్ కో–ఆర్డినేటర్ అశ్విని అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ జిల్లా పరిషత్ పాఠశాలలో మహిళ సాధికారత టీం వారు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయ బృందానికి బేటి బచావో బేటి పడావో పథకం, మహిళల హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం మంజుల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మెట్‌పల్లిరూరల్: మండలంలోని బండలింగాపూర్ జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థిని లవంగ భావన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. అండర్–12 విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా భావనను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి

జగిత్యాల: ఉద్యోగ బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని టీజీవో జిల్లా అధ్యక్షుడు గంగుల సంతోష్‌కుమార్ అన్నారు. శనివారం కార్యాలయంలో మాట్లాడారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన సిబ్బందికి వేతనాలు ఇవ్వాలని, అపరిష్కృతంగా ఉన్న 5 డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఎన్నికల్లో బదిలీ అయిన అధికారులను వెంటనే యథాస్థానాలకు పంపించాలని, ప్రభుత్వం ఉద్యోగులు సమాన నిష్పత్తి చందాతో ఆరోగ్య పథకం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కోశాధికారి గణేశ్, అసోసియేట్ అధ్యక్షుడు కందుకూరి రవిబాబు, అశోక్ పాల్గొన్నారు.

రత్నాపూర్‌లో బెల్ట్‌షాప్ నిర్వహణకు వేలం

మల్లాపూర్: మండలంలోని రత్నాపూర్‌లో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బెల్ట్‌షాప్ నిర్వహణకు, మద్యం అమ్మకాలకు వేలం పాట నిర్వహించినట్లు తెలిసింది. కాగా ఈ వేలం పాటలో పాల్గొన్న వారిలో ఒకరు రూ.1.65 లక్షలకు బెల్ట్‌షాప్‌ను దక్కించుకున్నట్లు సమాచారం. మండలంలోని పలు గ్రామాల్లో వీడీసీల పేరుతో యథేచ్ఛగా వేలం పాటను నిర్వహిస్తున్నా.. పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో గ్రామాల్లో వీడీసీల ఆగడాలు శృతి మించుతున్నాయని మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వీడీసీల అక్రమ వేలం పాట నిర్వహణపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మున్సిపాలిటీలో వేలం

ధర్మపురి: మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో శనివారం వాహనపార్కింగ్‌కు వేలం పాట నిర్వహించారు. ధర్మపురికి చెందిన సంగనభట్ల మణితేజ రూ.3.20 లక్షలకు దక్కించుకున్నాడు. మున్సిపల్ దుకాణాల వేలం పాటలో 1 నంబర్ దుకాణంకు నెలకు 5,500 కిరాయి చొప్పున బొంగురాల శ్రీనివాస్ సొంతం చేసుకున్నాడు. 3,4,5 దుకాణాలకు, మేకల మండికి దరఖాస్తులు రాకపోవడంతోం వాయిదా వేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రుద్ర శ్రీనివాస్

కోరుట్ల: భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కోరుట్ల పట్టణానికి చెందిన రుద్ర శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు గండమల్ల ఆనంద్ గౌడ్ శనివారం శ్రీనివాస్‌కు నియామక పత్రం అందజేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ధర్మపురి: ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని విద్యార్థుల తల్లిదండ్రులు అన్నారు. ధర్మపురిలోని న్యూ హరిజనవాడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గత కొన్నేళ్లుగా పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు కాశెట్టి మహేశ్, రాజేశ్వర్, గుండి రమాదేవి బదిలీపై వెళ్లారు. శనివారం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

శ్యామప్రసాద్ ముఖర్జీకి బీజేపీ నివాళి





జగిత్యాల, కోరుట్ల లో శ్యామ ప్రసాద్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

కోరుట్లటౌన్: భారతీయ జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు బీజేపీ నాయకులు శనివారం కోరుట్లలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు.

జగిత్యాల: డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు జగిత్యాలలో బీజేపీ కార్యాలయంలో ఘనంగా నివాళి లర్పించారు.

రాయికల్: మండలంలోని భూపతిపూర్‌లో త్యాగశీలి డాక్టర్ శ్యామ్‌ప్రకాశ్ ముఖర్జీ జయంతి సందర్భంగా శనివారం బీజేపీ నాయకులు మొక్కలు నాటారు.

పెగడపల్లి: శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను శనివారం పెగడపల్లిలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద ఆయన చిత్ర పటానికి నివాళి అర్పించారు. కార్యకమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కొమురెల్లి, జిల్లా అధికార ప్రతినిధి సత్యం, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనసూర్య, నాయకులు పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో..

మల్లాపూర్: శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మల్లాపూర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మి, నాయకులు ముద్దం సత్యనారాయణగౌడ్, లవంగ శివకుమార్, అశ్విన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన అగ్నిమాపక శాఖ ఎస్సై



జగిత్యాలక్రైం: జగిత్యాల అగ్నిమాపక శాఖ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణకాంత్ శనివారం ఉదయం జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

హీరో షోరూంలో అగ్నిప్రమాదం

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద హీరో షోరూంలో శనివారం సాయంత్రం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని పెద్ద ప్రమాదం తప్పింది. షోరూంలో మెకానిక్‌లు ద్విచక్రవాహనానికి సర్వీసింగ్ చేస్తుండగా బ్యాటరీ వద్ద షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారి మంటలు లేచి, పెట్రోల్ ట్యాంక్‌కు అంటుకోవడంతో తోటి మెకానిక్‌లు అప్రమత్తమై షోరూంలో విద్యుత్ సరాఫరాను నిలిపివేసి మంటలను అర్పివేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని షోరూం నిర్వాహకులు తెలిపారు. ప్రమాదంలో గణేశ్ అనే మెకానిక్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

వ్యవసాయ శాఖ మంత్రిని కలిసిన కృష్ణారావు

కోరుట్ల: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు శనివారం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును హైదరాబాద్ లోని సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

మోడల్‌స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో 6 నుంచి 10 వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నవీన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 10 లోపు పాఠశాలకు వచ్చి సంప్రదించాలని, ఈ నెల 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

అదనపు కట్నం కోసం వేధించిన వ్యక్తులపై కేసు నమోదు

జగిత్యాలక్రైం: అదనపు కట్నం కోసం వేధించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు. పట్టణంలోని వాణినగర్‌కు చెందిన గుంబర్తి హారతికి హైదరాబాద్‌కు చెందిన గుంబర్తి జయబాబుతో 16 నెలల క్రితం వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.10 లక్షల నగదు, ఆరుతులాల బంగారంతో పాటు, ఇతర సామగ్రి అప్పగించారు. కొద్ది రోజులుగా హారతిని భర్త జయబాబుతో పాటు, అత్త యాదమ్మ, ఆడబిడ్డలు ఉషా, సుజాత, స్రవంతి అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మన్మథరావు తెలిపారు.

మోసగించిన వ్యక్తిపై ..

సారంగాపూర్: మండలంలోని అర్పపల్లి గ్రామానికి చెందిన ఓ కిరాణం దుకాణ యజమానిని మోసగించిన వ్యక్తిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేసారు. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం గ్రామానికి చెందిన వేణుగోపాల్‌రెడ్డి దుకాణం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం దుకాణంలోకి కిరాణం సామాను కావాలని ఓ వ్యక్తి వచ్చి సామాను కొనుక్కున్నాడు. తాను కొన్న సామానుకు రూ. 1700, అదనంగా రూ.8300 నగదు డబ్బును మీ ఫోన్‌పే పంపిస్తాను, సామాను డబ్బులు పోను, మిగిలిన నగదు ఇవ్వాలని వచ్చిన వ్యక్తి కోరడంతో సరే అని దుకాణం యజమాని సామాను ఇచ్చి, నగదు రూ. 8,300 అందజేశాడు. వచ్చిన వ్యక్తి డబ్బులు పంపిస్తున్నాను అంటూ అటు ఇటూ తచ్చాడుతు అక్కడి నుండి బైక్‌పై పరారయ్యాడు. దీనిపై బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాఠశాలలో చోరీపై కేసు నమోదు

సారంగాపూర్: మండలంలోని రంగపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 1న జరిగిన చోరీపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం రంగపేట ఉన్నత పాఠశాలలో తాళాలు పగులగొట్టి పాఠశాలలోని మైక్‌సెట్, విద్యుత్తు బల్బులు, ఇతర సామగ్రిని అపహరించుకువెళ్లారు. వీటి విలువ రూ. 35,500 ఉంటుందని, పాఠశాల హెచ్‌ఎం సత్యనారయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు

కథలాపూర్: మండలంలోని బొమ్మెనలో ఓ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులను ఆయా కొడుతున్నారని తల్లిదండ్రులు శనివారం తహసీల్దార్ ముంతాజిబొద్దీన్‌కు ఫిర్యాదు చేశారు. ఈనెల 4న అంగన్‌వాడీ కేంద్రంలో బోయిని శ్రీనాథ్ అనే బాలుడిని ఆయా తీవ్రంగా కొట్టిందని తల్లిదండ్రులు బోయిని రాజేశం– మమత ఫిర్యాదు లేఖలో పేర్కొన్నారు.

ఘనంగా ప్రపంచ జూనోసిస్ డే



టీకాలు వేయిస్తున్న కుక్కల యజమానులు

కోరుట్లటౌన్/ ధర్మపురి/ కథలాపూర్: ఇబ్రహీంపట్నం/కోరుట్లరూరల్/ రాయికల్: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో శనివారం కార్యక్రమం నిర్వహించారు. 58 పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటి రేబీస్ టీకాలు వేశారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్లను సన్మానించారు. కథలాపూర్, అంబారిపేట పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు రేబీస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కోరుట్ల పట్టణంలోని పీవీ నరసింహారావు పశువైద్య కళాశాలలో మున్సిపల్ ఆధ్వర్యంలో ఉచిత రేబిస్ వ్యాధి నివారణ టీకా శిబిరం నిర్వహించారు. ఇబ్రహీంపట్నం మండలకేంద్రంలోని పశువైద్యశాలలో శనివారం జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలకు రేబీస్ వ్యాక్సిన్ టీకాలను వేశారు. మాదా పూర్ ఉన్నత పాఠశాలలో వెటర్నరీ డాక్టర్లు హిమజ, ధీరజ్‌లు జంతువుల ద్వారా సంక్రమించే వ్యాధులపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. పెంపుడు కుక్కలకు రేబీస్ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. రాయికల్ పట్టణంలో పశువైద్య ఆస్పత్రిలోఎంపుడు కుక్కలకు ఉచితంగా రేబీస్ టీకాలు వేశారు.

సంక్రమిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాల: పశువులు, జీవాలు, పెంపుడు జంతువులు సంక్రమిత వ్యాధుల బారిన పడకుండా రైతులు, పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. శనివారం పశువైద్యశాలలో ఉచిత యాంటి రేబీస్ టీకాల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, పెంపుడు జంతువులకు విధిగా టీకాలు వేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రఘువరన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ప్రభుత్వ విప్ పరామర్శ

మేడిపల్లి: మండలంలోని మన్నెగూడెం గ్రామానికి చెందిన బొడ్డు చిన్న గంగారాం, దేశాయిపేట గ్రామానికి చెందిన ఉరుమడ్ల సతీశ్, మన్రపల్లి రాములు, పోరుమల్ల గ్రామానికి చెందిన మాదం పెద్దకొమురవెల్లి కుటుంబాలను పభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం పరామర్శించారు. ఆయన వెంట మేడిపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఏనుగు రమేశ్ రెడ్డి, భీమారం మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, చేపూరి నాగారాజు, గంట శంకర్, చెక్కపల్లి శంఖర్, స్వామిగౌడ్, జలందర్ రెడ్డి పాల్గొన్నారు.

అధ్యాపకుడికి సన్మానం

జగిత్యాల: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న రాపర్తి శ్రీనివాస్‌కు వరకవి సిద్ధప్ప సాహిత్య అనుశీలన అంశంపై పరిశోధన చేసినందుకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా జగిత్యాల కళాశాల బృందం అతనిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టరేట్ లభించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అరిగెల అశోక్, సత్యప్రకాశ్, జ్యోతిలక్ష్మీ, ఎల్లబెత్‌రాణి, నీరజ, శ్రీనివాస్, రాధకృష్ణ, వేణు, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

సీఎం,మంత్రి, విప్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

ధర్మపురి: ఓరియంటల్ తెలుగు కళాశాల పునఃప్రారంభానికి కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చిత్రపటాలకు శనివారం నంది కూడలిలో కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ దినేశ్, సింహరాజు ప్రసాద్, చిలుముల లక్ష్మణ్, సుముఖ్, ఎడీ రఫీక్ తదితరులున్నారు.

నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరి కేసు

మల్లాపూర్: మండలంలోని వేంపల్లితండాలో మెట్‌పల్లి ఎక్సైజ్, మల్లాపూర్ పోలీసులు శనివారం దాడులు చేశారు. తండాకు చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి ఆరు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేశారు. 250 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సీఐ వినోద్ రాథోడ్ మాట్లాడుతూ.. నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మల్లాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్, ఎక్సైజ్ ఎస్సై లక్ష్మణ్, పోలీసు, ఎక్సైజ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జగిత్యాల జిల్లా:
9951602934, 9000308905
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
జగిత్యాల: రాజమల్లేశ్ - 9392460005
ధర్మపురి: వెంకటేష్ - 8008019205
కోరుట్ల: సురేశ్ - 7997958210
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899